


తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com
ఎడిటర్ కాడేపాగు అశోక్
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ



తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 127 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజీలు : 04, వెల రూ. 4రూ/ శనివారం- 04 - ఏప్రిల్- 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

## చైనాకు చుక్కెదురు..
## భారీ రాకెట్ ప్రయోగం విఫలం



★ చైనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. స్పేస్ పయనీర్‌కు చెందిన ఓ రాకెట్ నింగిలోకి లేచిన కొన్ని క్షణాలకే పేలిపోయింది.

★ ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఇండియన్ నేవీ అమ్ములపొదిలోకి- అణు జలాంతర్గామి
## ఐఎన్ ఎస్ 'అరిదమాన్' శత్రువులకు చిక్కని 'తారాగిరి'

❖కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా కమిషన్

❖అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ తారాగిరి శుక్రవారం జలప్రవేశం




ఢిల్లీ : భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అణుశక్తితో రూపొందించిన జలాంతర్గామి ఐఎన్ ఎస్ అరిదమాన్ ను లాంఛనంగా ప్రవేశపెట్టారు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్. ఫలితంగా అణు నావికాదళ విభాగం మరింత బలోపేతం అయింది. అంతకుముందు అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ తారాగిరి శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమానికి సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. భారత్ అత్యంత గోప్యంగా షిప్ సబ్‌మెర్సిబుల్ బాలిస్టిక్ న్యూక్లియర్ ప్రాజెక్ట్ ను తీసుకువచ్చింది. ఈ ప్రాజెక్ట్ కింద ఐఎన్ఎస్ అరిహంత్ మొదటి నౌక కాగా, దాని తర్వాత ఐఎన్ఎస్ అరిఘాట్ అనే మరో నౌక వచ్చింది. తాజాగా మూడో నౌక ఐఎన్ ఎస్ అరిదమాన్ ను కమిషన్ చేశారు. విశాఖపట్నంలో నిర్మించిన అరిదమాన్‌ను ఈ నౌకను అనేక నెలల పాటు సముద్ర రీక్షలు చేసిన తర్వాత నౌక దళంలోకి ప్రవేశపెట్టారు. ఐఎన్ఎస్ అరిహంత్ భారత్ మొట్టమొదటి స్వదేశీ అణు జలాంతర్గామి. మిగతా..2లో

## ఒక్కో గిరిజన కుటుంబానికి
# ఆవు, గేదె ఇస్తాం'

●ఏప్రిల్ 9న అసోం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

●ఈ క్రమంలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా- కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు

## అసోం ఓటర్లకు అమిత్ షా హామీలు



ఢిల్లీ : అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చొరబాటుదారులను అరికడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అలాగే చొరబాటుదారులను అసోం నుంచి వెనక్కి పంపుతుందని వెల్లడించారు. మిగతా..2లో

## గిరిజనులకు కాంగ్రెస్ చేసింది
# గుండు సున్నా



★ గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు.

★ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు.

## 2047 నాటికి తెలంగాణను
# టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం



▶▶తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని

▶▶కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

▶▶వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని

▶▶పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్ : 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి మిగతా..2లో

## బీఆర్ఎస్ క్లోజ్...
# ఆ పార్టీ రోడ్డున పడింది

● రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని మహేశ్ గౌడ్ అన్నారు.

●రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు.

●బీజేపీకి ఇక్కడ స్థానం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.



తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కోల్పోయిందని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్‌నే నమ్ముతున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని మహేశ్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత సొంతంగా వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందని చెప్పారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, దీనివల్ల అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై కేవలం తన ఫామ్ హౌస్‌కే పరిమిత మయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు దూరం పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మిగతా..2లో

## విశాఖ జోన్‌లోకి కొత్తగా ఏడు రైల్వేస్టేషన్లు - రైల్వే బోర్డు ఆదేశాలు



ఖుర్దా రోడ్ డివిజన్‌లో ఉన్న పలాస-ఇచ్ఛాపురం సెక్షన్ విశాఖ డివిజన్ లోకి

దక్షిణ కోస్తా రైల్వేజోన్ పై ఏ క్షణమైనా పూర్తిస్థాయి ప్రకటన

అమరావతి : విశాఖ కేంద్రంగా ఏర్పడిన "దక్షిణ కోస్తా" రైల్వే జోన్ పరిధికి సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. విశాఖ జోన్ లోకి కొత్తగా ఏడు రైల్వే స్టేషన్లు రానున్నాయి. రాష్ట్రంలోని పలాస-ఇచ్ఛాపురం సెక్షన్ ఇప్పటి వరకు ఒడిశాలోని ఖుర్దా డివిజన్‌లో కొనసాగింది. అయితే తాజాగా ఈ రెండు ప్రాంతాలను విశాఖ డివిజన్ పరిధిలోకి మారుస్తూ రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో విశాఖ జోన్ కు ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ "ఖుర్దా" డివిజన్ పరిధిలోని 7 స్టేషన్లు బదిలీ చేస్తూ రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. విశాఖ కేంద్రంగా ఉన్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు మారుస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు సౌత్ కోస్ట్, ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్లకు రైల్వే బోర్డు నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. ఈ నిర్ణయంపై ఉత్తరాంధ్ర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మిగతా..2లో

## కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం.. విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి




తెలంగాణలోనూ ఇదే తరహా మాటలు చెప్పే ప్రమాదం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు.

తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

ఆరు గ్యారెంటీల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారం సందర్భంగా గొప్పలు పలికారని, మున్ముందు తెలంగాణలోనూ ఇదే తరహా మాటలు చెప్పే ప్రమాదం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇటీవల రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొని, బీజేపీపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డి స్పందిస్తూ, కేరళ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణలో మిగతా..2లో

## ఆ జిల్లాలకు బిగ్ అలర్ట్..
## పిడుగులతో భారీ వర్షం



★రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది.

★రాగల మూడు గంటల్లో అల్లూరి, పోలవరం జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

## అమరావతిని నాశనం చేయాలని
# చూస్తే మేం శాసనం చేశాం

▶▶అమరావతి బిల్లు ఆమోదంపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం

▶▶అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం వల్ల మనకు గుర్తింపు, గౌరవం దక్కిందని రాజధాని ఉంటేనే ఏపీకి భవిష్యత్ ఉంటుందని వెల్లడి



అమరావతి : దేవతల రాజధాని పేరైన అమరావతిని పలకడం ఇష్టం లేకే మావిగన్ అనే పేరు జగన్ తెరపైకి తెచ్చారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. హిందూమతంపై ద్వేషంతో తిరుమల శ్రీవారికి అపచారం తలపెట్టిన వారు అమరావతి పేరు పలకటానికి ఇష్టపడతారా అని ప్రశ్నించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ ఒంటిమిట్టలో శ్రీరామకల్యాణంలో పాల్గొన్న సమయంలో లోక్ సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందిందని గుర్తుచేశారు. రాజ్యసభలో బిల్లు పాస్ అయిన వేళ పోలవరం డయాఫ్రామ్ వాల్ కూడా పూర్తి అయ్యిందని తెలిపారు. ఇంత జరుగుతున్నా వైఎస్సార్సీపీ నేతలు అహంకారం ప్రదర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ సభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందితే ఓర్వలేక పోతున్నారన్నారు. ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని ఏమిటని చంద్రబాబు ప్రశ్నించారు. పార్లమెంటు ఓ చట్టం చేస్తే దానిని అమలు చేయాల్సిన రాజకీయ పార్టీలు నా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామంటే ఎలా అని నిలదీశారు. దేశమంతా ఆంధ్రప్రదేశ్ కు మద్దతు పలికి అమరావతి నిర్మాణం కావాలని, దేశాభివృద్ధికి దోహదం చేయాలని సంఘీభావం తెలియచేశారన్న సీఎం వారందరినీ తప్పుపట్టేలా వైఎస్సార్సీపీ వింత ప్రవర్తన ఉందని విమర్శించారు. మిగతా..2లో

## ఒక్క వైసీపీ తప్ప అమరావతికి
# దేశమంతా మద్దతు ఇచ్చింది



ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఉభయ సభల్లో చట్టబద్ధత లభించడం చరిత్రాత్మకమని, ఇది ఐదు కోట్ల ఆంధ్రుల విజయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ఈ సందర్భంగా ఉండవల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర విభజన నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 2024 జూన్ 2 నుంచి అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని, రాష్ట్రపతి ఆమోదంతో ఇది చట్టంగా మారి అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు.

### పార్లమెంట్‌లో ప్రజా విజయం

అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో పార్లమెంట్‌లో దాదాపు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయని చంద్రబాబు వివరించారు. కొన్ని పార్టీలు నేరుగా మద్దతు పలకగా, మిగిలినవి కూడా సహకరించాయని తెలిపారు. ఇది ప్రజా రాజధానికి దక్కిన గౌరవమన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌తో పాటు మద్దతిచ్చిన అన్ని రాజకీయ పార్టీలకు, ఎంపీలకు ఐదు కోట్ల ప్రజల తరఫున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

### ఒక్క వైసీపీ తప్ప.. దేశమంతా ఏకతాటిపై

దేశంలోని అన్ని పార్టీలు తమ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం, దేశ ప్రయోజనాల కోసం అమరావతికి మద్దతుగా నిలిచాయని చంద్రబాబు అన్నారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఒక్కో గిరిజన కుటుంబానికి ఆవు, గేదె ఇస్తాం'

గిరిజన వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక పెద్ద డెయిరీని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను ఇస్తుందని స్పష్టం చేశారు. అసోంను కాంగ్రెస్ పార్టీ చొరబాటుదారులకు అడ్డాగా మార్చిందని ఆరోపించారు. ఈ మేరకు అసోంలోని గోల్పారాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్ అసోంను చొరబాటుదారులకు కేంద్రంగా మార్చింది. వారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతాల్లోకి కూడా చొరబాటుదారులు వస్తారు. వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చొరబాటుదారులను ఎంపిక చేసి వెనక్కి పంపుతుంది. చొరబాటుదారులందరినీ గుర్తించాం. ప్రస్తుతం సమయం కొంచెం తక్కువగా ఉంది. మాకు ఐదేళ్ల సమయం ఇవ్వండి. మేము గుర్తించిన చొరబాటుదారులను దేశం నుంచి వెళ్లగొడతాం. కాంగ్రెస్ పాలనలో గిరిజన సమాజ అభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ రూ. 25,000 కోట్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దాన్ని రూ. 1.38లక్షల కోట్లకు పెంచింది" అని అమిత్ షా పేర్కొన్నారు.

## ఆ జిల్లాలకు బిగ్ అలర్ట్.. పిడుగులతో భారీ వర్షం

అమరావతి, ఏప్రిల్03: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ శుక్రవారం వెల్లడించింది. రాగల మూడు గంటల్లో అల్లూరి, పోలవరం జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మన్యం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. 40-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. చెట్ల కింద నిలబడవద్దని ప్రజలకు స్పష్టం చేసింది. ఈ మేరకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఒక ప్రకటన విడుదల చేశారు.

## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## బీఆర్ఎస్ క్లోజ్... ఆ పార్టీ రోడ్డున పడింది: పీసీసీ మహేశ్ గౌడ్

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో మాకు 100 సీట్లు రావడం ఖాయం" అని ఆయన జోస్యం చెప్పారు.

## ఇండియన్ నేవీ అమ్ములపొదిలోకి- అణు జలాంతర్గామి ఐఎన్ ఎస్ 'అరిదమాన్' శత్రువులకు చిక్కని 'తారాగిరి'

దీనిని జూలై 2009లో ప్రారంభించి 2016లో నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. రెండో నౌక అరిఘాట్‌ను ఆగస్టు 2024లో ప్రవేశపెట్టింది. అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్న కొన్ని దేశాల జాబితాలో భారత్ కూడా చేరింది. ప్రస్తుతం అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వద్ద ఈ జలాంతర్గాములు ఉన్నాయి.

## కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం.. విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి


అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కానీ రెండున్నరేళ్లు కావొస్తున్నా ఎన్ని హామీలు నెరవేర్చిందో చెప్పాలని నిలదీశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏం చేశారని రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లి గొప్పలు చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చాక పదేళ్ల పాటు కేసీఆర్ ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు ఏదో చేశామని కాంగ్రెస్ పార్టీ చెబుతోందని, అదేమిటో చెప్పాలని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు.

## చైనాకు చుక్కెదురు.. భారీ రాకెట్ ప్రయోగం విఫలం

ఢిల్లీ :ఎలాన్ మస్క్ సారథ్యంలోని స్పేస్ ఎక్స్ సంస్థతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తున్న చైనాకు తాజాగా ఎదురుదెబ్బ తగిలింది. చైనా స్టార్టప్ సంస్థ స్పేస్ పయనీర్‌కు చెందిన టియాన్‌లాంగ్-3 రాకెట్ గాల్లోకి లేచిన కొన్ని సెకన్లకే పేలిపోయింది. గోబీ ఎడారిలో స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 12.17 సమయంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటనపై స్పేస్ పయనీర్ సంస్థ తమ పెట్టుబడిదారులకు క్షమాపణలు తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొంది. ఘటనకు గల కారణాలను విశ్లేషిస్తున్నట్లు వెల్లడించింది. స్పేస్ ఎక్స్‌కు చెందిన పునర్ వినియోగ రాకెట్ ఫాల్కన్-9తో పోటీ పడేలా టియాన్‌లాంగ్-3ను స్పేస్ పయనీర్ రూపొందించింది. ఒక రాకెట్‌ను కనీసం పది ప్రయోగాలకు వినియోగించుకునేలా రూపొందించారు. ఈ రాకెట్ ఒకేసారి 36 శాటిలైట్స్‌ను కక్ష్యలోకి మోసుకుపోగలదు. శాటిలైట్ ఇంటర్నెట్ సేవల కోసం భారీ సంఖ్యలో కియాన్‌ఫాన్ ఉపగ్రహాలను ప్రయోగించేందుకు చైనా లక్ష్యాన్ని నిర్దేశించుకుందని అక్కడి మీడియా చెబుతోంది. ఇప్పటివరకూ చైనా 108 కియాన్‌ఫాన్ శాటిలైట్‌లను కక్ష్యలోకి పంపింది. వచ్చే ఏడాది చివరి నాటికి 1300 శాటిలైట్‌లను, 2030 నాటికల్లా 15 వేల శాటిలైట్‌లను ప్రయోగించాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా టియాన్‌లాంగ్-3 అభివృద్ధిపై స్పేస్ పయనీర్ దృష్టిపెట్టింది. ఇక ఫాల్కన్-9 రాకెట్ సాయంతో స్టార్‌లింక్ ఇప్పటికే వేల సంఖ్యలో బ్రాడ్‌బాండ్ శాటిలైట్‌లను విజయవంతంగా ప్రయోగించింది.చైనాకు చుక్కెదురు.. భారీ రాకెట్ ప్రయోగం విఫలం

## యుద్ధం ఎఫెక్ట్.. ఈ వేసవిలో మందుబాబులకు

### మిడిల్ ఈస్ట్ యుద్ధం వల్ల గ్యాస్ సరఫరాకు ఆటంకం.. గాజు బాటిళ్ల తయారీ ఖర్చు పెరగడంతో భారత్‌లో మద్యం ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.



మిడిల్ ఈస్ట్ యుద్ధం ఎఫెక్ట్ భారత్‌లోని దాదాపు అన్ని రంగాలపై పడుతోంది. ఇప్పటికే గ్యాస్ లభ్యత విషయంలో అన్ని రంగాలు ప్రభావితం అవుతుండగా తాజాగా ఈ వార్ మందుబాబుల పాలిట శాపంగా మారబోతోంది. అంతర్జాతీయంగా సప్లై చైన్‌లో తలెత్తిన ఆటంకాల కారణంగా భారత్‌లోని మద్యం బాటిళ్ల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఆ పెంపు భారం మద్యం ప్రియుల జేబులు గుల్ల చేయడం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో ఈ వేసవిలో చల్లగా చిల్ అవుదామనుకునే మందుబాబుల మాడు పగలగొట్టేలా కనిపిస్తోంది.

**బాటిళ్ల తయారీపై ఎఫెక్ట్:**

ప్రస్తుత పరిస్థితుల్లో మద్యం తయారీలో ఉపయోగించే ముడి సరుకు కంటే ప్యాకేజీ ఖర్చే కంపెనీలకు భారంగా మారింది. మద్యం బాటిళ్లు తయారు చేయారీలో గాజు ఫర్నేస్(కొలిమి)లను నిరంతరం మండించాల్సి ఉంటుంది. దీనికి గ్యాస్ తప్పనిసరిగా కావాలి. అయితే భారత్ తన సహజవాయువు అవసరాల కోసం 40 శాతం వరకు ఖతార్‌పైనే ఆధారపడుతోంది. కానీ ఈ యుద్ధం కానీ యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. బీర్ తయారీ ఖర్చులో ప్యాకేజింగ్ వాటా 40 శాతం కాగా, స్పిరిట్స్ (విస్కీ, బ్రాండీ తదితరాల్లో) ఇది 20 శాతం వరకు ఉంటుంది. గ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడటం వల్ల అది నేరుగా గాజు బాటిళ్ల ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం పెరిగిన గ్యాస్ కష్టాలు, కమర్షియల్ గ్యాస్ ధరల వల్ల గాజు బాటిళ్ల ధర 15-20 శాతం పెరినట్లు ఇండియన్ మాల్ట్ విస్కీ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ చోప్రా అంచనా వేశారు.


**అదనంగా మరో 15 శాతం పెంచాలని:**

వీటికి అదనంగా షిప్పింగ్ చార్జీలు తోడవడంతో కంపెనీలు అదనంగా 10-15 శాతం ధరలు పెంచాలని కోరుతున్నాయని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఇలాగే కంటిన్యూ అయితే గాజు ఫర్నేస్ లు పూర్తి సామర్థ్యంతో పని చేయకగా బాటిళ్ల కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీంతో వేసవిలో ఏర్పడే డిమాండ్ కు సరిపడా సరఫరా ఉండకోపవచ్చని మెడుసా బేవరేజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్దీప్ సింగ్ హెచ్చరించారు. వీటికి తోడు అల్యూమినియం ధరలు సైతం 15 శాతం పెరగడం పరిస్థితిని మరింత ఆందోళన కరంగా మారుస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# అమరావతిని నాశనం చేయాలని చూస్తే మేం శాసనం చేశాం

మొదటి పేజి తరువాయి

రాజధానిపై కుట్రలు చేసిన వ్యక్తిని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిని నియంత అనాలా లేక ఏమనాలో తెలియడం లేదని విమర్శించారు. వైఎస్సార్సీపీ తిక్కకు పరిష్కారం ఏమిటో తనకు అర్థం కావట్లేదని ఎద్దేవా చేశారు. ప్లాన్ ఏ మూడు ముక్కలాటైతే, ప్లాన్ బీ మావిగన్ అనే మనస్తత్వం ఎవరికీ అంతుబట్టట్లేదని మండిపడ్డారు. కొందరు సైకో అంటుంటే ఇంకొందరు ఇంకేదో అంటున్నారని దుయ్యబట్టారు. తెలుగుజాతి ఉనికి లేకుండా చేయాలని విషం కక్కటం నీచమని ధ్వజమెత్తారు. చరిత్ర ఎప్పటికీ వారిని క్షమించదన్నారు. 9 నగరాలుగా అమరావతిని నిర్మించాలని ప్రణాళికలు చేశామన్న చంద్రబాబు 4 ఆఫీసు భవనాలు నిర్మించేస్తే రాజధాని అయిపోదని స్పష్టం చేశారు. నెర్వ్ సెంటర్ గా అమరావతి: విద్య, ఉద్యోగం, విజ్ఞానం లాంటి అంశాలకు నెర్వ్ సెంటర్ గా అమరావతి మారుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అమరావతి అభివృద్ధితోపాటు విశాఖ, తిరుపతి లాంటి ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాల నిర్మాణం పూర్తయితే అభివృద్ధి ఆటోపైలట్‌గా జరిగిపోతుందన్నారు. ప్రపంచంలోని వేర్వేరు ప్రాజెక్టులు ఈ మోడల్‌లోనే అభివృద్ధి అయ్యాయని తెలిపారు. 2029లో మళ్లీ ప్రధాని మోదీతో ఈ ప్రాజెక్టులన్నీ ప్రారంభింపచేస్తామన్నారు. అమరావతి అజేయం, శాశ్వతం, అన్ స్టాపబుల్ దీనికి అడ్డంకి కలిగించాలని చూస్తే వారివి పగటి కలలుగానే మిగిలిపోతాయని సీఎం స్పష్టం చేశారు. దేశానికి అమరావతి ప్రైడ్ గా నిలుస్తుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.




భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. అందుకే అమరావతి తీర్మానం పెట్టి పార్లమెంటుకు పంపితే దానికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని వివరించారు. బ్లూ, గ్రీన్ సిటీగా, అధునాతన నగరంగా అమరావతిని తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేశామన్నారు. రహదారులు, విద్యుత్ కోసం డక్ట్ లు, క్లీన్ అండ్ గ్రీన్ విధానంలో చేపట్టామన్నారు. 1,307 ఎకరాలను 113 సంస్థలకు రాజధానిలో భూములు కేటాయించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. తెలంగాణకు మేము వ్యతిరేకం కాదు: రాష్ట్ర విభజన నాటి కష్టాలను చంద్రబాబు గుర్తుచేశారు. తెలంగాణకు తాము వ్యతిరేకం కాదని మొదటి నుంచీ చెప్తున్నానని ఆ రాష్ట్రానికి నష్టం కలగాలని ఎప్పుడూ కోరుకోనని తేల్చిచెప్పారు. తెలంగాణకు హైదరాబాద్ ఉందన్న సీఎం మనకి అలాంటి నగరం కావాలని ఒక సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. అన్ని ప్రాంతాలకు మధ్యలో అమరావతి ఉందని తెలిపారు. అమరావతి కి అటు 12, ఇటు 12 పార్లమెంట్ స్థానాల మధ్యలో ఉందన్నారు. అమరావతి పేరుకి ప్రదేశానికి ఒక చరిత్ర ఉందని గుర్తుచేశారు. అమరావతిని వ్యతిరేకించినా గత పాలకులు గతిలేని పరిస్థితిలో ఇక్కడి నుంచే పాలన సాగించారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. భూములు ఇచ్చిన వారంతా సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతోనే అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. శంషాబాద్ లో భూములు ఇచ్చిన వారంతా కోటీశ్వరులు అయ్యారని గుర్తుచేశారు. నాలెడ్జి ఎకానమీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు వేసిన పునాదుల వల్ల మోస్ట్ లివబుల్ సిటీగా అది మారిందన్నారు. వైఎస్సార్సీపీ వాళ్లు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. నేను కూడా స్వీట్ తింటా: అమరావతిని వైఎస్సార్సీపీ నాశనం చేస్తే తాము శాసనం చేశామని సీఎం తెలిపారు. ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత లభించటం ప్రజా విజయమన్నారు. అమరావతికి చట్టబద్ధత లభించినందుకు మీడియా ప్రతినిధులందరికీ స్వయంగా స్వీట్లు పంచారు. ఆనందంలో ఇవాళ తాను కూడా స్వీట్ తింటానంటూ చంద్రబాబు రుచి చూశారు. రాష్ట్రం, దేశం నాశనమైనా పర్లేదు తమకు స్వార్థ రాజకీయమే ముఖ్యం అన్నట్లు వైఎస్సార్సీపీ వ్యవహరించిందని ధ్వజమెత్తారు. అమరావతి అడుగు పడిన సమయంలోనే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారని దుయ్యబట్టారు. అమరావతిపై వ్యతిరేకతతో ప్రపంచబ్యాంకుకు కూడా లేఖలు రాయడం సహా అరాచకం సృష్టించే ప్రయత్నించారని విమర్శించారు. అమరావతిని ఎడారి, శ్మశానం అనడంతో పాటు భూకంపాలు వస్తాయని తప్పుడు ప్రచారం చేశారని ఆక్షేపించారు. ఎన్ని విధాలా రాజధానిని నష్టపరచాలో అంతా చేశారని ఇప్పటికీ చేస్తునే ఉన్నారని ధ్వజమెత్తారు.

# విశాఖ జోన్‌లోకి కొత్తగా ఏడు రైల్వేస్టేషన్లు - రైల్వే బోర్డు ఆదేశాలు

మొదటి పేజి తరువాయి

వాస్తవానికి "ఖుర్దా" డివిజన్‌లో కొనసాగితే ఆ సెక్షన్ ఒడిశాలోని భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న "ఈస్ట్ కోస్ట్ జోన్" పరిధిలోకి వెళ్లిపోయేది.

**సిక్కోలు రైతన్నలకు శుభవార్త - విశాఖ దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లో ఆ రెండు ప్రాంతాలు!**

విశాఖ కేంద్రంగా ప్రకటించిన దక్షిణ కోస్తా రైల్వేజోన్ పై ఏ క్షణమైనా పూర్తిస్థాయి ప్రకటన వచ్చే అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్ కు సంబంధించిన భవనం సిద్ధం అవుతుందని, అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జోన్ పరిధి, ఎన్ని కిలోమీటర్లు ఉంటుంది, ఏయే డివిజన్లు ఉంటాయి, వాటి పరిధి, స్టేషన్లు, ఇతరత్రా వివరాలన్నీ ఏ క్షణంలో అయినా వెలువడచ్చన్నారు. కాజీపేట డివిజన్ పై సౌత్ కోస్ట్ మధ్య రైల్వే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అసలు డివిజన్ ఏర్పాటు ఆలోచనే లేదని స్పష్టం చేశారు. రైల్ నిలయంలో జరిగిన మీడియా సమావేశంలో జోన్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను ఆయన ప్రస్తావించారు. 2025-26 సంవత్సరంలో జోన్ నమోదు చేసిన అత్యుత్తమ పనితీరు వివరాలను వెల్లడించారు. "దక్షిణ కోస్తా రైల్వేజోన్ పై ఏ క్షణమైనా ప్రకటన వచ్చే అవకాశం ఉంది. సౌత్ కోస్ట్ రైల్వేజోన్ భవనం, అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. 2025-26ఏడాదిలో జోన్ నమోదు చేసిన అత్యుత్తమ పనితీరు కనబరిచింది." - సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, దక్షిణ మధ్య రైల్వే జీఎం సిక్కోలు రైతన్నలను ఇది శుభవార్త: ఇప్పటివరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని ఖుర్దా రోడ్ డివిజన్‌లో ఉన్న ఇచ్చాపురం నుంచి పలాస మధ్య రైల్వే ప్రాంతం ఉంది. ఇప్పుడు ఆ రెండు ప్రాంతాలను విశాఖ కేంద్రంగా ఉన్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోకి చేరినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.'ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ ఖుర్దా డివిజన్ పరిధిలోని ఇచ్చాపురం నుంచి పలాస వరకు ఉన్న 7 రైల్వే స్టేషన్లు విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కు బదిలీ చేస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులు విడుదల చేయడం ఆనందంగా ఉంది. నా అభ్యర్థనకు కార్యరూపం దాల్చుతూ ఉత్తర్వులు విడుదల




చేసిన రైల్వే బోర్డు, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు. - రామ్మోహన్ నాయుడు, కేంద్రమంత్రి శ్రీకాకుళం జిల్లా, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇది చిరస్మరణీయమైన రోజుగా ఆయన అభివర్ణించారు. వంశధార నదిపై నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని తెలిపారు. సిక్కోలు రైతన్నలకు ఇది శుభవార్త అని హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ ఆధారిత శ్రీకాకుళం జిల్లా భవిష్యత్తుకు ఇది చరిత్రాత్మక మలుపుగా రామ్మోహన్ నాయుడు అభివర్ణించారు.

# ఒక్క వైసీపీ తప్ప అమరావతికి దేశమంతా మద్దతు ఇచ్చింది

మొదటి పేజి తరువాయి

కానీ, ఈ రాష్ట్రంలో ఓట్లు వేయించుకుని గెలిచిన వైసీపీ మాత్రం రాష్ట్రానికి ద్రోహం చేసిందని తీవ్రంగా విమర్శించారు. "దేశమంతా ఒక దారి అయితే, వీళ్లది ఇంకో దారి అయ్యే పరిస్థితి వచ్చింది. దేశ ప్రయోజనాలు అవసరం లేదు, రాష్ట్రం నాశనమైనా పర్వాలేదు, మేమనుకున్నదే జరగాలని పట్టుదలతో ఉన్నారు. మేము అమరావతికి శాసనం చేస్తే, వాళ్లు దానిని నాశనం చేయాలనుకున్నారు" అని చంద్రబాబు ఆరోపించారు.

**అమరావతి ఆవిర్భావం.. అప్పటి పరిస్థితులు**

2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని, ఆదాయం లేక తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉన్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో, తనకున్న అనుభవంతో ఏడు ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేస్తేనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానని స్పష్టం చేయడంతో, కేంద్రం ఆర్డినెన్స్ ద్వారా ఆ ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. అనంతరం, శివరామకృష్ణన్ కమిటీ నివేదిక, ప్రజాభిప్రాయం మేరకు విజయవాడ-గుంటూరు మధ్య గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతిని ఎంపిక చేశామని తెలిపారు. రైతుల త్యాగాలతో, ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిన ల్యాండ్ పూలింగ్ ద్వారా 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా 34 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేశామని వివరించారు.



విధ్వంసం సృష్టించి.. భవిష్యత్తును దెబ్బతీశారు

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అమరావతిపై కక్ష కట్టిందని, విధ్వంసకర రాజకీయాలతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టిందని చంద్రబాబు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయడంతో విధ్వంసానికి నాంది పలికారని, అమరావతి పనులను నిలిపివేశారని మండిపడ్డారు. మూడు రాజధానుల డ్రామాతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని చూశారని, సింగపూర్ కన్సార్టియం వంటి అంతర్జాతీయ సంస్థలపై అవినీతి ఆరోపణలు చేసి వెళ్లగొట్టారని విమర్శించారు. రైతులు 1631 రోజుల పాటు పోరాడితే వారిపై అక్రమ కేసులు పెట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ దుర్మార్గాల వల్లే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి, దక్షిణాది రాష్ట్రాల్లో అత్యల్ప తలసరి ఆదాయంతో నిలిచిందని అన్నారు.

తిరిగి పట్టాలెక్కిన పనులు.. భవిష్యత్ ప్రణాళిక ఇదే

ప్రజలు ఇచ్చిన అఖండ విజయంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ఇంజన్ సర్కార్‌తో అమరావతి పనులు తిరిగి ప్రారంభమయ్యాయని చంద్రబాబు తెలిపారు. అమరావతిలో 9 ప్రత్యేక నగరాలు (గవర్నమెంట్, ఫైనాన్స్, నాలెడ్జ్, జస్టిస్, హెల్త్, స్పోర్ట్స్, టూరిజం, మీడియా, ఎలక్ట్రానిక్స్ సిటీలు) నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. అమరావతి ఒక సెల్ఫ్ సస్టైనబుల్, ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్ట్ అని, దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. 2028 నాటికి ఐకానిక్ భవనాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తి చేస్తామని, 2029లో ప్రధాని మోదీ చేతుల మీదుగా వాటిని ప్రారంభిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ఇక శాశ్వతం.. ఎవరు ఆపలేరు**

పార్లమెంట్ చట్టబద్ధత కల్పించిన తర్వాత కూడా రాజధానిపై కొందరు అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని, "ఎక్కడ కూర్చుంటే అక్కడే రాజధాని" అనడం వారి తిక్కకు నిదర్శనమని చంద్రబాబు ఎద్దేవా చేశారు. అమరావతి అభివృద్ధిని ఎవరూ ఆపలేరని, ఇది అజేయం, అన్‌స్టాపబుల్, శాశ్వతం అని స్పష్టం చేశారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహించి, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గిరిజనులకు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా

మొదటి పేజి తరువాయి

నారాయణపేట జిల్లా: గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతర(లోక్ మసంద్ మహారాజ్ జాతర)కు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బడ్జెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. మా లంబాడీలను దగా చేశారు. సీఎం రేవంత్, ఆయన మనుమడు ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా?. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని సీఎం రేవంత్ రెడ్డి వారిని జైలులో పెట్టారు. ఇక్కడ చేసింది చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు. ఇంట్లో ఈగల మోత అంటే కేరళపోయి పల్లకీల మోత అన్నట్లు ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో రుణమాఫీ వంద శాతం జరిగిందో రేవంత్ చూపించాలి. నేను కొడంగల్ వచ్చినా గ్రామసభల్లో మీ నాయకులను జనం నిలదీస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్యాకేజ్-3లో కొంత పని మాత్రమే మిగిలి ఉంది. త్వరగా ఆ పని పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని చేయల్లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. మీ నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగింది' అని అన్నారు.

# జీవన్ రెడ్డి చేరిక ద్వారా బీఆర్ఎస్ రాష్ట్ర రాజకీయాల్లో కలక సందేశం ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది.

### రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం.. బీఆర్ఎస్ గూటికి జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఫిక్స్!

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ చేరికకు మూహుర్తం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. ఈ నెల 13వ తేదీన ఆయన గులాబీ కండువా కప్పుకోబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 7వ తేదీన జగిత్యాలకు బీఆర్ఎస్ (దీ=బా) వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ వెళ్లి జీవన్ రెడ్డితో భేటీ అవుతారని ఈ సందర్భంగా ఆయనను పార్టీలోకి ఆహ్వానించబోతున్నట్లు తెలుస్తోంది. అమెరికా పర్యటన ముగించుకుని రాగానే జీవన్ రెడ్డితో సంప్రదింపులు జరుపుతారని తెలుస్తోంది. కాగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ గత నెల 25న పార్టీతో తనకు ఉన్న 40 ఏళ్ల అనుబంధానికి ముగింపు పలుకుతూ జీవన్ రెడ్డి కాంగ్రెస్ కు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

**బీఆర్ఎస్ బిగ్ స్కెచ్:**

జీవన్ రెడ్డి చేరికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్



నాయకత్వం ఈ చేరికతో మరో స్కెచ్ వేస్తున్నట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డి చేరిక తర్వాత జగిత్యాల వేదికగానే బీఆర్ఎస్ ప్లీనరీ నిర్వహించాలని గులాబీ బాస్ కేసీఆర్ నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం అధికార పార్టీ జోరుతో క్షేత్ర స్థాయిలో డీలాపడిన బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఊపు తీసుకువచ్చేలా ప్లీనరీ సమావేశానికి ప్రణాళికలు రచిస్తుండగా జీవన్ రెడ్డి లాంటి కీలక నేతలు పార్టీలోకి వస్తే వారికి తగిన గుర్తింపు కూడా ఉంటుందనే సంకేతాలు క్షేత్రస్థాయిలోకి ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది.

# ఉద్యమాల పురటి గడ్డకు...పురటి నొప్పులు..!

**ఆస్తిత్వం కొలిపోయిన అమరచింత.సంఘటితంగా ప్రయత్నం చేద్దాం..**

**నియోజకవర్గ పునర్విభజనలో పూర్వవైభవం తెద్దాం.దేశాయి ప్రకాష్ రెడ్డి మాజీ అడ్వకేట్ జనరల్.**

అమరచింత ఏప్రిల్ 3 (వార్త నిర్భయం) రాబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో అమరచింత ఆస్తిత్వం కొలిపోయిన అమరచింత నియోజకవర్గ సాధన కోసం ఈ ప్రాంత బిడ్డగా తాను ముందుంటానని దేశాయ్ ప్రకాష్ రెడ్డి మాజీ అడ్వకేట్ జనరల్ అన్నారు . శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని దేశాయి మురళీధర్ రెడ్డి ప్రైమర్ స్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశం మండల కేంద్రానికి చెందిన అన్ని రాజకీయ పక్షాల నాయకులతో వివిధ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్ రెడ్డి కల్లుగీత కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు నాగరాజు గౌడ్ పాల్గొని మాట్లాడుతూ తాను ఈ ప్రాంతంలో పుట్టి , ఇక్కడే పెరిగి , ఈ ప్రాంతం పై మక్కువతో నియోజకవర్గ సాధన కోసం రాజకీయాలకతీతంగా కృషి చేసినందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. అమరచింత నియోజకవర్గ అస్తిత్వం కోల్పోయిందని ఎంతో ఉద్యమ చరిత్ర కలిగిన అమరచింత ఉద్యమాల పురటి గడ్డ అనిగతంలో నియోజకవర్గాల పునర్విభజన లో అమరచింత నియోజకవర్గం లో ఉన్న, నర్వ ఆత్మకూర్ మండలాలు మక్తల్ నియోజకవర్గంలో కలవగా చింతకుంట మండలాలు



దేవరకద్ర నియోజకవర్గంలో కలిసి ఈ ప్రాంత అభివృద్ధి, రాజకీయ ఆస్తిత్వం కూలిపోయి కొంతమేరకు దెబ్బతిందన్నారు.ఇకనైనా అమరచింత నియోజకవర్గం సాధించుకునేందుకు మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను ఒప్పించి నియోజకవర్గాన్ని సాధిద్దాం అన్నారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమ కారులు,పాత్రికేయులు, పలు సంఘాల నాయకులు నియోజకవర్గ సాధన పై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.త్వరలోనే కార్యాచరణ రూపొందించి నియోజకవర్గ సాధనలో ప్రజలను భాగస్వాములు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ఈ కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాస్ మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ రవి. మున్సిపల్ వైస్ చైర్మన్ రాధా అరుణ్. నర్సింలు గౌడ్ ఎస్ ఏ రాజు మంగ లావణ్య మెరువ రాజు ఎస్పీ రత్నం మారుతి అశోక్. అబ్రహం హనుమంతు ఎస్ రాజు.వెంకట్ రెడ్డి కేజీ జైసింహారెడ్డి. జర్నలిస్టు మిత్రులు తదితరులు పాల్గొన్నారు

# ప్రేమ కరుణతో సర్వం సుసాధ్యం

**భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు రెవరెండ్ ఫాదర్ కస్పారెడ్డి**

సూర్యాపేట బ్యూరో ఏప్రిల్ 3(వార్త నిర్భయం) ప్రేమ కరుణ సహనంతో సర్వం సుసాధ్యం చేయవచ్చని నిరూపించిన ఏకైక వ్యక్తి యేసు ప్రభువు అని సూర్యాపేట ఆర్సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ కస్పారెడ్డి పేర్కొన్నారు. పరిశుద్ధ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) సందర్భంగా శుక్రవారం సూర్యాపేట లోని నిర్మల చర్చి ఆధ్వర్యంలో సిలువ దారి ఏసుక్రీస్తు చివరి రోజులను నాటక రూపంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని నిర్మల చర్చ వద్ద ప్రారంభమైన పరిశుద్ధ సిలువ మార్గం కార్యక్రమం అంబేద్కర్ బొమ్మ, శంకర్ విలాస్, గాంధీ బొమ్మ, ఆకారపు సుదర్శన్ బొమ్మ నుండి నిర్మల ఆసుపత్రిలోని కల్వరికొండ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు మరణానికి సంబంధించిన 14 గుర్తులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కస్పారెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ మానవాళిని పాపముల నుండి విముక్తులు చేసేందుకు క్రీస్తు ప్రభువు సిలువపై మరణం పొందాడని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పాపాల నుండి విముక్తులు కావాలని సూచించారు. ఏసుప్రభువు కల్మషం లేకుండా జీవించి శారీరకంగా మరణించినా తిరిగి పునరుత్థానుడయ్యారని తెలిపారు. ప్రజలు యేసు ప్రభువు చూపిన మార్గంలో పయనిస్తూ తోటి వారి పట్ల ప్రేమానురాగాలను కలిగి, క్షమాగుణం ఆప్యాయత అనురాగాలను కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలను త్యజించి ప్రభు చూపించిన సన్మార్గం మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం సాయంత్రం



ఆర్.సి.యం చర్చిలో సిలువ ముద్దు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఫాదర్ లు, నిర్మల సిస్టర్స్, ఏ వి యం సిస్టర్స్, కాన్సిల్ మెంబెర్స్ ముక్కలా మర్రెడ్డి, వల్లమల్ల బాలాస్వామి, పిండిగ అజయ్, నాగటి ఏసుదాసు, బంధ శ్యాంసన్, పట్టేటి బాలశౌరి, పాండురంగీ బాలరాజు, గోపికిరణ్, కతోలిక విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# బేతెస్థ ఖాసీంపేట లో గుడ్ ఫ్రైడే హోలీ ఫ్రైడే ఆరాధనాలి

**మానవాళి పాప పరిహారార్థం సిలువపై ప్రాణాలు అర్పించిన జీసస్ క్రీస్తూ మరణం ప్రేమ క్షమాపణ త్యాగం బిషప్ దుర్గం హెప్సిబా ప్రభాకర్.**

సూర్యాపేట బ్యూరో ఏప్రిల్ 3(వార్త నిర్భయం) శుక్రవారం : సూర్యాపేట 4వ వార్డు ఖాసీంపేట బేతెస్థ మినిస్ట్రీస్ మెయిన్ చర్చి నందు గుడ్ ఫ్రైడే సందర్భంగా బిషప్ దుర్గం హెప్సిబా ప్రభాకర్ మాట్లాడుతూ క్రీస్తును శిలువ వెయ్యటం, కల్వరి(కపల) కొండ వద్ద అతని మరణం యొక్క జ్ఞాపకాలను గుర్తుచేసుకొనే క్రైస్తవమత విశ్వాసులకి,ప్రపంచ మానవాళికి గొప్ప రక్షణ దినం అనీ,ఈ పవిత్ర వారం సమయంలో పవిత్రమైన మూడు రోజులలో భాగంగా ఈస్టర్ ఆదివారానికి ముందు వచ్చే శుక్రవారం రోజున యేసు క్రీస్తూ మానవాళి పాపములు క్షమించబడుటకొరకు తన్ను తాను శిలువ మరణం కొరకు తన ప్రాణంను అర్పించుకొన్నాడనీ తరచుగా పాసోవర్ పై యూదుల అభిప్రాయంతో సరిగ్గా సరిపోలుతుందనీ దీనిని హోలీ ఫ్రైడే, బ్లాక్ ఫ్రైడే లేదా గ్రేట్ ఫ్రైడే అని కూడా పిలువబడుతుందనీ క్రీస్తు సువార్తల ఆధారంగా క్రీస్తును శిలువ వెయ్యటం శుక్రవారమే జరిగిందనీ రెండు వేర్వేరు సమూహాలచే గుడ్ ఫ్రైడే యొక్క సంవత్సరం సా.శ. 33 గా అంచనా వెయ్యబడిందనీ వాస్తవానికి బైబిలికల్, జూలియన్ క్యాలెండర్ల మధ్య ఉన్న వ్యత్యాసాలు చంద్రవంక ద్వారా ఐజాక్ న్యూటన్ అనే ఖగోలా శాస్త్ర వేత్తచే సా.శ. 34 గా చెప్పబడింది శిలువ వేసినప్పుడు చంద్రుని కాంతి తగ్గిపోయి చీకటి అవ్వటం, అదే తేదీన అనగా శుక్రవారం ఏప్రిల్ 3, సా.శ. 33 న గ్రహణం ఏర్పడటం 2:20 చట్టాలలో "మూన్ ఆఫ్ బ్లడ్" పై అపోస్తలీక్ పీటర్ యొక్క సూచనతో సంబంధం కలిగి ఉంటుందనీ ఈ ఆధారంగా చెప్పబడిన ఒక పూర్తి వైవిధ్యమైన ఖగోళపరమైన విధానం సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ఆయన సిలువపై ప్రాణాలు అర్పించారని, సైన్ట్ ఫిక్ గా



మరియు బిబిలికల్ గా ఋజువు చేయబడిందని అన్నారు.ఈ కార్యక్రమం లో తీతు, బాబు,ఉపేందర్, బాబు, యేసుపాదం, వెంకన్న,జానయ్య తదితరులు పాల్గొన్నారు

# అఖిల పక్ష పోరాటం సమితి ఆధ్వర్యంలో నేటికి 96 రోజులు ధర్నా

**అనంతపూర్ సర్పంచ్ సుల్తాన్ నాయుడు సంఘీభావం తెలిపినాడు**

ఏదుల మండలం ఏప్రిల్03( వార్త నిర్భయం)ఏదుల మండల కేంద్రంలో జరుగుతున్న గొల్లపల్లి - చీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక అఖిల పక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నేటికీ 96 రోజులుగా నిరంతరాయంగా సాగుతుంది. ఈ శిబిరానికి అనంతపూర్ సర్పంచ్ సుల్తాన్ నాయుడు విచ్చేసి తన సంఘీభావం తెలియచేస్తూ గొల్లపల్లి గ్రామంలో తనకు భూమి ఉంది అది రిజర్వాయర్ పోతుంది అంటే బాధ కలుగుతుంది. దయచేసి ఎమ్మెల్యే అర్థం చేసుకుంటారు అని అనుకున్న కానీ అయన మనసులో రిజర్వాయర్ కచ్చితంగా కట్టితిరుతాను అనే దోరనే కనిపిస్తుంది. మన గొల్లపల్లి రిజర్వాయర్ కట్టి తన దాహం తీర్చొకోవడం కంటే గట్లఖానాపూర్ రిజర్వాయర్ కట్టుకొని ఎన్ని వేల కోట్లు అయిన సంపాదించుకోండి. వనపర్తి నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వండి అని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయి ముఖ్యనాయకులు ధర్నా చౌక్ వచ్చి ఈ వనపర్తి ఎమ్మెల్యే మొండి వైఖరిని ఎండగడుతారు కనీసం అప్పుడు అయిన సిగ్గు వస్తదేమో అని ఎద్దేవా చేశారు. రైతు కష్టాలు పడుతున్న బాధలు అర్థం



చేసుకోలేకపోయినా ఎమ్మెల్యే ఇలాంటి శాసనసభ్యులు మాకు అవసరమా బాధపడుతున్న రైతుల యొక్క ఆవేదన జై కిసాన్ జై జవాన్

# అడవి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలులి

**108 కు ఫోన్ చేసిన స్థానికులు ఆసుపత్రి కి తరలింపు**

జడ్చర్ల ఏప్రిల్ 03 వార్త నిర్భయం తన వ్యవసాయ పొలంలో పని చేసుకుంటుండగా ఒక్కసారిగా అడవి పంది దాడి చేసి రైతును తీవ్రంగా గాయపరచడంతో రైతు పరిస్థితి విషమంగా ఉన్న ఘటన జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.ఉదండాపూర్ గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ ఎప్పటిలాగే తన వ్యవసాయ పొలంలో పని నిమిత్తం శుక్రవారం ఉదయం వెళ్లి పని చేసుకుంటుండగా అడవి పంది దాడి చేసి రైతు రామకృష్ణ శరీరాన్ని పూర్తిగా చీల్చి వేయడంతో పేగులు బయట పడి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతు న్నాడు. అటుగా వెళ్తున్న కొందరు రైతులు ఈ ఘటనను గమనించి రామకృష్ణ కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని రామకృష్ణను చికిత్స నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కాగా, రామకృష్ణను తీవ్రంగా గాయపరిచిన అడవి పంది ఇంకా చెట్లపొదల్లోనే ఉండడంతో పరి సరాలప్రాంతాలరైతులు భయాందోళనకు గురవుతున్నారు.



# నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ..

**ప్రత్యేక వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ శ్రీగోధ రెడ్డి ..**

వరంగల్ ప్రతినిధి ఎప్రిల్ 03 (వార్త నిర్భయం) హనుమకొండ: నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పింగిలి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కుమారుడు నాయిని విశాల్ రెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి డాక్టర్ నాయిని శ్రీగోదా విష్ణు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యమని చెప్పారు. సమయానికి పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెద్ద వ్యాధులను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.అనంతరం విద్యార్థినీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.




# కేరళాలో కమ్యూనిస్టులు ఢిల్లీలో కమ్యూనలిస్టులా..!

**దండి వెంకట్ బహుజన లెఫ్ట్ పార్టీ కమ్యూనిస్టు (బి ఎల్ పి) తెలంగాణ రాష్ట్ర.కమిటీ, హైదరాబాద్.**



హైదరాబాద్ ఏప్రిల్ 3 (వార్త నిర్భయం) దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ దేశంలోనివివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతిపక్ష పార్టీలను కూడగట్టి ఇండియా కూటమికి ప్రాణం పోసిన కమ్యూనిస్టు యోధుడు అమరుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి గారు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టిలో కమ్యూనలిస్టు అయ్యారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు అవినీతి ఆరోపణలులేని రాష్ట్రంగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన కేరళ రాష్ట్రాన్ని పాలిస్తున్న కమ్యూనిస్టులు, ఢిల్లీలో కమ్యూనలిస్టులు అంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికలప్రచారంలో కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వంపై అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను దోచుకోవడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంటే, పేదరిక నిర్మూలన మౌలిక సదుపాయాలకల్పనలో, అవినీతి ఆరోపణలులేని రాష్ట్రంగా దేశంలోనే కేరళా మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులపై ఇంకా ఎలాంటి ఆరోపణలైనా చేస్తారు. ఎందుకంటే అది ఆయన ఆధిపత్య రాజకీయ నిబద్ధతకు నిదర్శనంగా చెప్పవచ్చు.బిజెపి జేబు సంస్థగా కాంగ్రెస్ పార్టీ మారిందని సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ఎం.ఏ. బేబీ గారు హిందుస్తాన్ టైమ్స్కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మరి బిజెపి జేబు సంస్థ కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన రాజకీయ వేదికలను ఎలా పంచుకున్నారని సిపిఎం రాజకీయ ప్రత్యర్థులు తోపాటుసాధారణ ప్రజలు వేసే ప్రశ్నలకుసిపిఎం కేంద్ర నాయకత్వం దగ్గర సమాధానం లేదు. ఒకవేళ బీజేపీవ్యతిరేక రాజకీయ పోరాటం అంటూ సమర్థించుకుంటారేమో.దానికి వారి పార్టీ సభ్యులు సంతృప్తి చెందగలరేమో కానీదేశంలోని అశేషమైన కమ్యూనిస్టు అభిమానులకుఆమోదయోగ్యం కాదనే విషయాన్ని వారు గ్రహించాలి.1975 ఎమర్జెన్సీ నుండి కమ్యూనిస్టులను రెండు ముక్కలుగా చేసి ఒక ముక్కసిపిఐ భుజం పై రాజకీయ తుపాకీతో సిపిఎంను చైనా ఏజెంట్లని ఎమర్జెన్సీని వ్యతిరేకించిన కేంద్ర, రాష్ట్ర, జిల్లాస్థాయి కమ్యూనిస్టులను వందలాది మందిని జైళ్లలో నిర్బంధించిన విషయాన్ని భారతకమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పేజీల్లో నిక్షిప్తమై ఉంటుంది.కాంగ్రెస్ పార్టీ అయినా బిజెపి పార్టీ అయినా రెండూ కూడా ఒకేతాను ముక్కలే అనే విషయాన్ని సిపిఐ, సిపిఎం పార్టీలు ఇంకా గుర్తించలేకపోవడానికి కారణంవారికి భారతీయ తాత్విక దృక్పథం కలిగిన మహాత్మా జ్యోతి బా ఫూలే, సావిత్రమ్మ ఫూలే, నారాయణ గురు, నారాయణ మేఘాజీ లోఖాండే,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్,ఎరియార్ల కుల వర్గ రాజ్యాధికార ప్రత్యామ్నాయ కార్యక్రమం లేకపోవడమే.ఇప్పటికైనా సిపిఐ, సిపిఎంపార్టీలు ముఖ్యంగా ఆయా పార్టీల్లోని బహుజన కమ్యూనిస్టులు ఆలోచించాలి. మార్క్సిజం-అంబేద్కరిజం ఆలోచన జమిలి సైద్ధాంతిక రాజకీయ కార్యక్రమం ద్వారాఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ/అగ్రకుల పెట్టుబడిదార్ల ప్రతినిధులైన కాంగ్రెస్, బీఆర్ఎస్, టిడిపి, వైసిపి లాంటి పార్టీలు కమ్యూనిస్టులకు ఎన్నటికీ రాజకీయ మిత్రులు కారని, కాబోరని తెలిసుకోవడంలో కమ్యూనిస్టు పార్టీలు దారుణమైన వైఫల్యం చెందాయి.ఈ దేశంలో కమ్యూనిస్టులతో ఎన్నికల పొత్తులు పెట్టుకున్న ఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ /అగ్రకుల పెట్టుబడిదార్ల ప్రతినిధులైన కాంగ్రెస్, బీఆర్ఎస్, టిడిపి, వైసిపి లాంటి పార్టీలు రాజకీయంగా లబ్ధి పొంది రాజ్యాధికారంలోకి వచ్చారే తప్ప కమ్యూనిస్టులు మాత్రం రాజకీయ లబ్ధి పొందిన దాఖలాలు లేవు.వాస్తవానికి కమ్యూనిస్టులకు వ్యక్తులకు సంబంధించిన రాజకీయ లబ్ధి అంటూ ఉండదు,అది ప్రజా సమస్యల పరిష్కారానికి ముడిపడి ఉంటుందని తెలియజేస్తూ...

# చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ: మంత్రి కొండా సురేఖ





వరంగల్. ప్రతినిధి ఎప్రిల్ 03 (వార్త నిర్భయం) నగరంలోని చెరువుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువులలో రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అమృత్ 2.0 పథకం కింద చేపట్టిన ఈ పనులు పూర్తయ్యే సరికి చెరువుల పరిరక్షణతో పాటు భూగర్భ జలాల పెరుగుదల, పర్యావరణ సంరక్షణ, నగర సౌందర్యం మెరుగుపడుతాయని మంత్రి పేర్కొన్నారు. చెరువులను శుభ్రపరచి, ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఉర్సు రంగసముద్రం చెరువు మరియు దేశాయిపేట చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. నగరంలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి మేయర్, కమిషనర్, కలెక్టర్ల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 5 గ్యారంటీల అమలు జరుగుతోందని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, సిఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం, రూ.5 లక్షల ఉచిత జీవన బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఉన్నాయని తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్ నేపథ్యంలో మహిళలకు కుట్టు యంత్రాలపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందించడం ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డా. సత్య శారద, చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు సురేష్ జోషి, మరుపల్ల రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజాపాలనలో ప్రజల సమస్యలు ఆలకించిన ఎమ్మెల్యే .భూపతి రెడ్డి

**పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలిన జనాలు**

**ఆయా గ్రామాల ప్రజల సమస్యలు ఉన్న ఎమ్మెల్యే**

**సమస్యల పరిష్కారానికి హామీ..హర్షం వ్యక్తం చేసిన ప్రజలు**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 3 వార్త నిర్భయం :

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు భూపతి రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన ప్రజావాణిలో శుక్రవారం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. నియోజకవర్గ పరిధిలోని డిచ్ పల్లి,ధర్పల్లి,ఇందల్వాయి,సిరికొండ,మోపాల్ మండలాల నుండి ప్రజలు వివిధ సమస్యల నిమిత్తం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఎమ్మెల్యే ఆలకించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు,మంచినీటి సౌకర్యం,విద్యుత్ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. అటు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సందడిగా మారింది.

# రైతును నమ్మించి.. వంచించిన రేవంత్ సర్కార్!

**- హామీలన్నీ నీటి మూటలే.. రైతాంగం తీవ్ర ఆగ్రహం**

**- శ్రీరాంసాగర్, నిజాంసాగర్ పూడికతీత ఏమైంది?**

**- 'మంచిప్ప'కు నిధులేవి? చక్కెర ఫ్యాక్టరీల ముచ్చటేది?**

**- ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పూర్ భూమయ్య నిప్పులు**

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి,

?మోపాల్, ఏప్రిల్ 03 వార్త నిర్భయం:

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతోందని, క్షేత్రస్థాయిలో రైతులకు ఒరిగిందేమీ లేదని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం మోపాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి, ఇప్పుడు రైతులను గాలికి వదిలేశారని మండిపడ్డారు.

## మంత్రుల హామీలు.. తుస్సుమన్నాయి!

గతేడాది ఏప్రిల్ 21న నిజామాబాద్ గిరిరాజ్ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'రైతు మహోత్సవం' వేదికగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జిల్లా రైతులకు భారీ ఆశలు కల్పించారని భూమయ్య గుర్తు చేశారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడికను తీయించి, నిల్వ సామర్థ్యాన్ని పెంచుతామని చెప్పి ఏడాది కావస్తున్నా.. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. రైతుల ప్రాణాధారమైన ఈ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కనీస శ్రద్ధ చూపకపోవడం శోచనీయమన్నారు.

## ముఖ్యమంత్రి మాటకు విలువ లేదా?

స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా మంచిప్ప 21 ప్యాకేజీ పనులను వెంటనే పూర్తి చేస్తామని ప్రకటించారని, నేటికీ దానికి సంబంధించిన నిధుల ఊసే లేదని భూమయ్య ఆక్షేపించారు. "ఇది మాటల ప్రభుత్వం కాదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అలాగే, జిల్లాలో మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెప్పి ఇప్పుడు మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటని అడిగారు. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని




కమిటీ సానుకూల నివేదిక ఇచ్చినా.. ఫ్యాక్టరీల పునరుద్ధరణపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిలదీశారు. సారంగాపూర్ ఎన్.సి.ఎస్.ఎఫ్ ఫ్యాక్టరీని బెల్లం తయారీ కేంద్రంగానైనా మార్చి ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు.

## జిల్లా నాయకులపై నిలదీత..

జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, సాక్షాత్తు పీసీసీ అధ్యక్షుడి ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ.. జిల్లాకు దక్కింది కేవలం 'మొండి చేయి' మాత్రమేనని భూమయ్య ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, జిల్లా రైతాంగం సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నా పట్టించుకునే నాథుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వానికి హెచ్చరిక..

తక్షణమే శ్రీరాంసాగర్, నిజాంసాగర్ పూడికతీత పనులు ప్రారంభించాలని, మంచిప్ప ప్యాకేజీకి నిధులు విడుదల చేయాలని, అలాగే చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని ఏఐకేఎంఎస్ ఉపాధ్యక్షులు భూమయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతాంగాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నేతలు అగ్గు ఎరన్న, అగ్గు చిన్నయ్య, మండల కార్యదర్శి బి. నర్సయ్య, జి. గంగాధర్, ఎం. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధోని అడ్డాలో రోహిత్, కోహ్లీ విధ్వంసం మామూలుగా లేదుగా.. అసలు మ్యాటర్ తెలిస్తే షాకే




భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ రాంచీలోని అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత భారతదేశంలో వన్డే మ్యాచ్ ఆడనున్నారు. ధోని అడ్డాలో రోహిత్, కోహ్లీ విధ్వంసం మామూలుగా లేదుగా.. అసలు మ్యాటర్ తెలిస్తే షాకే మహేంద్ర సింగ్ ధోని స్వస్థలం రాంచీలో మరోసారి క్రికెట్ ఉత్సాహం కనిపించనుంది. దాదాపు మూడు సంవత్సరాల తర్వాత, నవంబర్ 30 న %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో భారత్ %-% దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ జరగనుంది. ఉత్సాహం ఎంతగా ఉందంటే, చలికాలపు రాత్రి కూడా, వేలాది మంది క్రికెట్ అభిమానులు అర్ధరాత్రి నుంచే స్టేడియం వెలుపల వరుసలో క్యూ కట్టారు. జాకెట్లు , మఫ్లర్లు, టోపీలు, దుప్పట్లు ధరించి ఉదయం 9 గంటలకు కౌంటర్లు తెరిచిన వెంటనే తమ అభిమాన భారత స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను ప్రత్యక్ష ప్రసారంలో చూసే అవకాశం లభిస్తుందని ఆశించి టిక్కెట్లు కొనుగోలు చేశారు.రాత్రి 12 గంటల నుంచే టిక్కెట్ల కోసం క్యూ.. స్టేడియంలో జరిగే ఈ అంతర్జాతీయ మ్యాచ్ కోసం, %జీూజాూ% స్టేడియం వెలుపల ఉన్న 6 టికెట్ కౌంటర్ల నుంచి ఈరోజు, అంటే నవంబర్ 25న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆఫ్‌లైన్ టిక్కెట్లను విక్రయించారు. అయితే, క్రికెట్ పట్ల ఉన్న క్రేజ్ ఎంతగా ఉందంటే, అభిమానులు అర్ధరాత్రి 12:00 గంటల నుంచే స్టేడియం వెలుపల ఉన్న టికెట్ కౌంటర్ లైన్‌ను ముందు క్యూ నిలిచారు. ఈ మ్యాచ్ టిక్కెట్ ధరలు రూ .1200 నుంచి రూ .12,000 వరకు ఉన్నాయి. వివిధ విభాగాల దిగువ, ఎగువ శ్రేణికి వేర్వేరు ధరలు నిర్ణయించారు. ఇంకా, ఆతిథ్యాన్ని బట్టి టికెట్ ధరలు మారుతూ ఉంటాయి. ఆఫ్‌లైన్ టికెటింగ్ కోసం ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. రెండు కౌంటర్లలో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి రసీదులు చూపించిన తర్వాత ఆఫ్‌లైన్ టిక్కెట్లు జారీ చేయనున్నారు. ఒక కౌంటర్ మహిళలకు రిజర్వు చేశారు. ప్రతి వ్యక్తికి గరిష్టంగా రెండు టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలి. ఇంకా, టిక్‌టాక్ బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి, అభిమానులు టికెట్ కౌంటర్లలో టిక్కెట్లను క్రమబద్ధంగా అందుకునేలా చూసు కోవడానికి పెద్ద సంఖ్యలో భద్రతా దళాలను మోహరించారు. ఇవి కూడా చదవండిఏకంగా 89 మంది ప్లేయర్లకు ఇచ్చిపడేసిన వైభవ్ సూర్యవంశీ.. అదేంటంటే.? మొదటి బ్యాచ్‌లో ఐదుగురు ఆటగాళ్ళు రాంచీకి.. ఈరోజు ఐదుగురు భారత ఆటగాళ్ళు రాంచీకి చేరుకుంటారు. ఇందులో రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, తిలక్ వర్మ, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు. భారత జట్టులోని మిగిలిన సభ్యులు, దక్షిణాఫ్రికా జట్టు నవంబర్ 27న గౌహతి నుంచి రాంచీకి చేరుకుంటారు. ఆటగాళ్ళు రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయం నుంచి బయలుదేరి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. అక్కడ వారు నవంబర్ 28, 29 తేదీలలో %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో బస చేసి ప్రాక్టీస్ చేస్తారు.భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో తొలి

మ్యాచ్ రాంచీలోని అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత భారతదేశంలో వన్డే మ్యాచ్ ఆడనున్నారు. ధోని అడ్డాలో రోహిత్, కోహ్లీ విధ్వంసం మామూలుగా లేదుగా.. అసలు మ్యాటర్ తెలిస్తే షాకే మహేంద్ర సింగ్ ధోని స్వస్థలం రాంచీలో మరోసారి క్రికెట్ ఉత్సాహం కనిపించనుంది. దాదాపు మూడు సంవత్సరాల తర్వాత, నవంబర్ 30 న %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో భారత్ %-% దక్షిణాఫ్రికా వన్డే మ్యాచ్ జరగనుంది. ఉత్సాహం ఎంతగా ఉందంటే, చలికాలపు రాత్రి కూడా, వేలాది మంది క్రికెట్ అభిమానులు అర్ధరాత్రి నుంచే స్టేడియం వెలుపల వరుసలో క్యూ కట్టారు. జాకెట్లు , మఫ్లర్లు, టోపీలు, దుప్పట్లు ధరించి ఉదయం 9 గంటలకు కౌంటర్లు తెరిచిన వెంటనే తమ అభిమాన భారత స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆటను ప్రత్యక్ష ప్రసారంలో చూసే అవకాశం లభిస్తుందని ఆశించి టిక్కెట్లు కొనుగోలు చేశారు.రాత్రి 12 గంటల నుంచే టిక్కెట్ల కోసం క్యూ.. స్టేడియంలో జరిగే ఈ అంతర్జాతీయ మ్యాచ్ కోసం, స్టేడియం వెలుపల ఉన్న 6 టికెట్ కౌంటర్ల నుంచి ఈరోజు, అంటే నవంబర్ 25న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆఫ్‌లైన్ టిక్కెట్లను విక్రయించారు. అయితే, క్రికెట్ పట్ల ఉన్న క్రేజ్ ఎంతగా ఉందంటే, అభిమానులు అర్ధరాత్రి 12:00 గంటల నుంచే స్టేడియం వెలుపల ఉన్న టికెట్ కౌంటర్ లైన్‌ను ముందు క్యూ నిలిచారు. ఈ మ్యాచ్ టిక్కెట్ ధరలు రూ .1200 నుంచి రూ .12,000 వరకు ఉన్నాయి. వివిధ విభాగాల దిగువ, ఎగువ శ్రేణికి వేర్వేరు ధరలు నిర్ణయించారు. ఇంకా, ఆతిథ్యాన్ని బట్టి టికెట్ ధరలు మారుతూ ఉంటాయి. ఆఫ్‌లైన్ టికెటింగ్ కోసం ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. రెండు కౌంటర్లలో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి రసీదులు చూపించిన తర్వాత ఆఫ్‌లైన్ టిక్కెట్లు జారీ చేయనున్నారు. ఒక కౌంటర్ మహిళలకు రిజర్వు చేశారు. ప్రతి వ్యక్తికి గరిష్టంగా రెండు టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలి. ఇంకా, టిక్‌టాక్ బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి, అభిమానులు టికెట్ కౌంటర్లలో టిక్కెట్లను క్రమబద్ధంగా అందుకునేలా చూసుకోవడానికి పెద్ద సంఖ్యలో భద్రతా దళాలను మోహరిం చారు. ఇవి కూడా చదవండిఏకంగా 89 మంది ప్లేయర్లకు ఇచ్చిపడేసిన వైభవ్ సూర్యవంశీ.. అదేంటంటే.? మొదటి బ్యాచ్‌లో ఐదుగురు ఆటగాళ్ళు రాంచీకి.. ఈరోజు ఐదుగురు భారత ఆటగాళ్ళు రాంచీకి చేరుకుంటారు. ఇందులో రుతురాజ్ గైక్వాడ్, హర్షిత్ రాణా, తిలక్ వర్మ, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ ఉన్నారు. భారత జట్టులోని మిగిలిన సభ్యులు, దక్షిణాఫ్రికా జట్టు నవంబర్ 27న గౌహతి నుంచి రాంచీకి చేరుకుంటారు. ఆటగాళ్ళు రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయం నుంచి బయలుదేరి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. అక్కడ వారు నవంబర్ 28, 29 తేదీలలో %జీూజాూ% అంతర్జాతీయ స్టేడియంలో బస చేసి ప్రాక్టీస్ చేస్తారు.

# స్మృతి కాబోయేవాడితో ఉన్న ఈ అమ్మాయ్ ఎవరు.! పలాష్ ఇంత పెద్ద చీటరా.? వైరల్ ఫోటోలు



భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఇప్పుడు కొత్త ట్విస్ట్ బయటపడింది. భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో పెళ్లిని వాయిదా వేసుకున్నారు స్మృతి మంధాన. పెళ్లి కొడుకు తరపున వారు చెప్పినా ఆమె తండ్రి ఆరోగ్యమే ముఖ్యమని చెప్పడంతో.. పెళ్లి ఆగిపోయింది. అయితే అదేరోజు రాత్రి పలాశ్ ముచ్చల్ కూడా అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైరల్ ఇన్ఫెక్షన్, అసిడిటీ వల్ల అతడు ఇబ్బంది పడ్డాడని వైద్యులు వెల్లడించారు. చికిత్స అనంతరం పలాశ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అయితే ఈ విషయానికి సంబంధించి పలాశ్ సోదరి పలాక్ ముచ్చల్ ఇన్‌స్టా వేదికగా స్టోరీ షేర్ చేశారు. 'స్మృతి మంధాన నాన్నగారికి అనారోగ్యం కారణంగా, మంధాన, పలాశ్ వివాహం ప్రస్తుతానికి ఆగిపోయింది. ఈ సమయంలో అందరూ ఇరు కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని కోరుతున్నానంటూ పోస్ట్ చేశారు.

# ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.?




ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కానీ విదేశీ టోర్నీలలో మాత్రం తన సత్తా చాటాడు. ఇది అటుంచితే కెప్టెన్ గా మాత్రం విఫలమయ్యాడు. ఆడిన 4 మ్యాచ్ లలోనూ ఓటమిపాలై.. పేలవ ప్రదర్శన కనబరిచింది. మరి ఆ స్టోరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందామా. ఓ సారి లుక్కేయండి.ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.?ప్రపంచంలోనే రిచ్చెస్ట్ క్రికెట్ లీగ్ అంటేనే ఠక్కున మైండ్‌లోకి వచ్చేది ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్). ఈ లీగ్‌లో ఆడాలని ప్రతీ విదేశీ ప్లేయర్ ఉవ్విళ్ళూరుతుంటారు. అయితే ఇంగ్లాండ్ ప్లేయర్స్ మాత్రం కొంచెం డిఫరెంట్. తమ దేశానికే ప్రాతినిధ్యం ఇస్తామని.. అదే మా ఫస్ట్ ప్రయారిటీ అంటూ వేలంలో అమ్ముడుపోయినా లీగ్ నుంచి అడ్డంగా వైదోలుగుతుంటారు. ఆ కోవకు చెందిన ప్లేయర్ ఇంగ్లాండ్ మాజీ ఓపెనర్ జాసన్ రాయ్. ప్రస్తుతం ఐపీఎల్‌లో జాసన్ రాయ్‌పై రెండేళ్ల బ్యాన్ ఉంది. అయితే మనోడు విదేశీ లీగ్స్‌లో మాత్రం తన సత్తా చాటుతున్నాడు. ప్రస్తుతం అబుదాబీ వేదికగా టీ10 లీగ్ జరుగుతోంది. ఇందులో జాసన్ రాయ్ రాయల్ చాంప్స్ తరపున బరిలోకి దిగాడు. అంతేకాదు ఆ జట్టుకు సారథ్య బాధ్యతలు కూడా చేపట్టాడు. పలు మ్యాచ్‌లలో కెప్టెన్ ఇన్నింగ్స్‌లు ఆడాడు గానీ.. తన జట్టుకు విజయాలు అందించడంలో విఫలమయ్యాడు. మొత్తంగా ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌లలో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతడి స్ట్రైక్ రేటు 162.71గా ఉంది. ఈ విధ్వంసకర ఓపెనర్ బ్యాట్‌తో తన ప్రతాపం చూపించినా.. కెప్టెన్‌గా విఫలమయ్యాడు. రాయల్ చాంప్స్ ఆడిన 4 మ్యాచ్‌లలో అన్నింటా ఓడిపోయి.. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కాగా, జాసన్ రాయ్ గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.

# మా దగ్గర కోచ్ ఉద్యోగం ఖాళీ లేదు.. గౌతమ్ గంభీర్ కోచింగ్ పై ఐస్‌లాండ్ క్రికెట్ దారుణమైన సెటైర్



భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ టెస్ట్ క్రికెట్ ప్రదర్శన బాగా లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. ఈ విమర్శల పరంపరలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా పాలుపంచుకుంది. తమ %శ% ఖాతాలో.. అభిమానుల సందేహాలు నివృత్తి చేస్తున్నాం. మా దేశానికి కోచ్‌గా ఉండటానికి గంభీర్‌ను పిలవడం లేదు. భారత జట్టు ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ టెస్ట్ క్రికెట్ ప్రదర్శన బాగా లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. ఈ విమర్శల పరంపరలో ఐస్‌లాండ్ క్రికెట్ కూడా పాలుపంచుకుంది. తమ %శ% ఖాతాలో.. అభిమానుల సందేహాలు నివృత్తి చేస్తున్నాం. మా దేశానికి కోచ్‌గా ఉండటానికి గంభీర్‌ను పిలవడం లేదు. మా కోచ్ చాలా మంచివారు. మా జట్టు 2025లో 75% మ్యాచ్‌లు గెలిచింది అని వ్యంగ్యంగా పోస్ట్ చేసింది. గంభీర్ టెస్ట్ సమస్యలు ఇప్పుడు దేశంలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా జోక్‌గా మారాయని ఈ పోస్ట్ స్పష్టం చేసింది.2024 మధ్యలో భారత జట్టు కోచ్‌గా గంభీర్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అతని టెస్ట్ రికార్డు ప్రశ్నార్థకంగా మారింది. అతని కోచింగ్‌లో భారత్ 12 ఏళ్లలో మొదటిసారిగా స్వదేశంలో న్యూజిలాండ్‌పై 0-3 వైట్‌వాష్‌తో ఓడిపోయింది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 1-3 తేడాతో కోల్పోయింది. గణాంకాలు చూస్తే గంభీర్ ఆధ్వర్యంలో ఆడిన 18 టెస్ట్ మ్యాచ్‌లలో భారత్ కేవలం 7 విజయాలు, 9 ఓటములు నమోదు చేసింది. ప్రస్తుతం సౌతాఫ్రికా సిరీస్‌లో కూడా దాదాపు ఓటమి అంచున ఉంది. ఈ వరుస ఓటములకు కారణం సరైన ఆటగాళ్ల ఎంపిక లేకపోవడం, గందరగోళమైన వ్యూహాలు, బ్యాట్స్‌మెన్ల దూకుడు ఆట అని విమర్శకులు ఆరోపిస్తున్నారు. స్వదేశంలో, విదేశాల్లో జట్టు పదేపదే తక్కువ స్కోర్లకే ఆలౌట్ అవ్వడం, అలాగే స్థిరమైన ఫలితాలు రాకపోవడం గంభీర్ కోచింగ్ సామర్థ్యంపై సందేహాలను పెంచుతున్నాయి. టెస్ట్ క్రికెట్‌లో గంభీర్ రికార్డు అంత బాగోలేకపోయినా, వన్డే, టీ20 ఫార్మాట్‌లో మాత్రం అతని కోచింగ్ అద్భుతంగా పనిచేసింది. అతని ఆధ్వర్యంలో భారత్ కేవలం తొమ్మిది నెలల వ్యవధిలో ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ టైటిళ్లను గెలుచుకుంది. ఈ టైటిల్ విజయాలు, టెస్ట్ వైఫల్యాలపై వచ్చిన విమర్శలను కొంతవరకు తగ్గించాయి.